ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 5 మే 2024



దంచి కొడుతున్న ఎండలు

- వడగాలులతో ప్రజలు ఉక్కిరి..బిక్కిరి
- వడదెబ్బతో ఇప్పటికే నలుగురు మృతి
- జిల్లాలో ఆరెంజ్ అలర్ట్
- 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

8లో..

కరెంట్ కోతలు... మంచినీళ్లకు గోస

- సిరిసిల్లలో సాంచెలు బంద్
- ఆరుగ్యారంటీలతో రాష్ట్రాన్ని ఆగం చేశారు
- బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు
- జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారం, రోడ్ షో

సిరిసిల్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): కరెంట్ కోతలు, మంచినీళ్ల గోస చాలయింది. సిరిసిల్లలో మరమగ్గాలు బందువడ్డాయని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు అన్నారు. శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉదయం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. సిరిసిల్ల రైతుబజార్, మార్కెట్, లేబర్ అడ్డా, వెంకంపేట, బీవైనగర్ కార్మిక వాడల్లో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అని రాష్ట్రాన్ని ఆగం చేసి అరచేతితో వైకుంఠం చూపి ఎన్నికల ముందు అభయహస్తం, తరువాత భస్మాసుర హస్తమేనని అన్నారు. ఐదేళ్ల కింద బండి సంజయ్ అనే పెద్దమనిషిని గెలిపిస్తే సిరిసిల్లకు ఒక్కరూపాయి పనిచేశాడా, ఏ గల్లీలో అయినా బండి సంజయ్ శిలాఫకం చూపిస్తారా అని సవాల్ విసిరారు. సిరిసిల్లకు నేను ఏమి పనిచేశానో చూపిస్తానన్నారు. బీజేపీ ఒక్క పనిచేసింది చూపించి ఓటు అడగాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు మీ ఓటుతోనే సమధానం చెప్పాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట



సిరిసిల్ల రోడ్‌షోలో మాట్లాడుతున్న కేటీఆర్

అగయ్య, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంఇచె శ్రీనివాస్, సెస్ డైరెక్టర్లు దార్నం లక్ష్మీనారాయణ, దిడ్డి రమాదేవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గుడ్ల మంజుల, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బొల్లి రామ్మోహన్, అగ్గిరాములు, దిడ్డి శ్రీనివాస్, మ్యాన రవి, తదితరులు పాల్గొన్నారు.

● పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేటీఆర్ శనివారం ఉదయం 6.30 గంటలకే సిరిసిల్ల రైతు బజార్ నుంచి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రైతులతో మాట్లాడుతు సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



గంగాధర రోడ్‌షోలో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

● అభివృద్ధా.. విధ్వంసమా.. ఆలోచించండి..

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

కరీంనగర్ టౌన్/గంగాధర: అభివృద్ధి కావాలో... విధ్వంసం కావాలో తేల్చుకొని ఆలోచించి ఓటు వేయాలని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. గంగాధర మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. సింగాపూర్ తరహా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయడం తన లక్ష్యమన్నారు. అబద్దాల పునాదులపై అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఓటర్లు గుర్తించారని, మళ్లీ మోసపోవడానికి సిద్ధంగా లేరని తెలిపారు. ఎంపీగా బండి సంజయ్ కేంద్రం నుంచి ఐదు రూపాయలు కూడా తీసుకురాలేదన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

ఈవీఎంల కమిషనింగ్ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల కలెక్టరేట్/వేములవాడ, మే 4: ఈ నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలతోపాటు వేములవాడ జూనియర్ కళాశాలలో శనివారం ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కమిషనింగ్ ప్రక్రియను పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని సూచనలు చేశారు. ఈవీఎంలపై సీరియల్ నంబర్లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన చిహ్నాల ఏర్పాటు పక్కాగా ఉండాలని ఆదేశించారు. కమిషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించాలని, ఈవీఎంల పనితీరు పరిశీలించాలని అన్నారు. స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ వివరాలను ఏఆర్‌వోలను అడిగి తెలుసుకున్నారు.

ఫెసిలిటేషన్ కేంద్రాల సందర్శన

సిరిసిల్లలోని గీతా నగర్ పాఠశాలలో, వేములవాడలోని నూతన గ్రంథాలయ భవనంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాలను



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టర్ అనురాగ్ జయంతి శనివారం సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సజావుగా జరిగేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. అదన పు కలెక్టర్, సిరిసిల్ల ఏఆర్‌వో పి.గౌతమి, వేములవాడ ఏఆర్‌వో రాజేశ్వర్, సిరిసిల్ల ఆర్డీవో రమేష్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్లు షరీఫ్ మోహినుద్దీన్, మహేశ్ కుమార్ తదితరులు ఉన్నారు.

వడదెబ్బపై జాగ్రత్తలు వివరించాలి: డీఎంహెచ్‌వో



వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వైద్యాధికారి

ఇల్లంతకుంట, మే 4: ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందని, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని జిల్లా వైద్యాధికారి సుమనమోహన్‌రావు సూచించారు. మండలంలోని ముస్కానిపేటలో ఆరోగ్య సేవలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి శరణ్య, సిబ్బంది బాలచందర్, నయిం, ఏఎన్ఎమ్‌లు సులోచన, కవిత, ఆషా కార్యకర్తలు రాజమని, రజని తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ఆహ్వానం



కేటీఆర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 4: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్న ఉర్సు ఉత్సవాలకు హాజరు కావాలని మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు ఉత్సవ నిర్వాహకుడు అజీజ్ శనివారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. మండల కో- ఆప్షన్ సభ్యుడు జబ్బార్, నాయకులు షాదుల్లా, జహంగీర్, లాల్‌మహ్మద్, అహ్మద్, వాజీద్, రఫీక్, బాబా, మాజీద్, ఉస్మాన్, మహబూబ్, గౌసొద్దీన్, ముజాఫర్, శ్రీనివాస్‌గౌడ్, దేవరాజు తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, మే 4: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో సైబర్ నేరాల వివరాలు వెల్లడించారు. సైబర్ నేరగాళ్ల పంపిన లింక్‌లు, మెస్సేజ్‌లు క్లిక్‌చేసి మోసపోవద్దన్నారు. మొబైల్‌కి వచ్చే ఓటీపీలు ఎవరికి షేర్ చేయొద్దని, జిల్లాలో వారం రోజుల్లో పలువురు రూ.3.08లక్షల మోసపోయారని తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన ఓ బాధితుడు వాట్సప్‌లో బ్యాంకు లింకు వచ్చిందని క్లిక్‌చేయడంతో రూ. 2.39లక్షలు కోల్పోయాడని పేర్కొన్నారు. సిరిసిల్లలో ఓ బాధితుడు తన ఇల్లు అద్దెకు ఇస్తానని ఓఎల్ఎక్స్‌లో పోస్టు చేయడంతో అది చూసిన సైబర్‌నేరస్థులు అద్దెకు అడ్వాన్సు ఇస్తామన్నారని, క్యూఆర్ కోడ్ పంపించమని చెప్పడంతో వెంటనే పంపగా సైబర్‌గాళ్లు రూ. 48వేలు కాజేశారని తెలిపారు. రుద్రంగిలో ఓ బాధితుడు జాబ్‌కోసం ప్రయత్నించగా క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి సైబర్ నేరస్థులు రూ. 21వేలు తీసేసుకున్నారని పేర్కొన్నారు. ఎవరైనా మోసపోతే హెల్ప్‌లైన్ నెంబర్ 1930, డయల్ 100కు కాల్‌చేసి చెప్పాలని తెలిపారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా నరేశ్



నియామక పత్రం అందుకుంటున్న నంది నరేశ్

ఎల్లారెడ్డిపేట, మే 4: బీజేపీ ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన నంది నరేశ్ నియామకమయ్యారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి రాణిరుద్రమకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

చందుర్తి, మే 4: మండలంలోని కట్టలింగంపేట గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు మోత్కుపల్లి జలందర్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని వేములవాడ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు శనివారం పరామర్శించారు. మృతుడి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన వెంట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి గూడూరు ప్రవీణ్, కేడీసీసీ డైరెక్టర్ కిషన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య ఉన్నారు.

కార్పొరేటర్ల కొనుగోలుపై విచారణ జరపాలి

- అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని అవమానించిన కాంగ్రెస్
- ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 4: కార్పొరేటర్ల కొనుగోలుపై విచారణ జరిపించాలని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాత్రి కొత్తపల్లిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసు ద్వారా సంపాదించిన డబ్బులతో కార్పొరేటర్లను కాంగ్రెస్ కొనుగోలు చేస్తున్నదన్నారు. ఒక్కో కార్పొరేటర్ ఖాతాలో ఐదు లక్షల రూపాయలు జమ చేశారన్నారు. తక్షణమే ఎన్నికల సంఘం బ్యాంకు లావాదేవీలపై విచారణ జరిపించాలన్నారు. రాజ్యాంగాన్ని వందసార్లు మార్చిన కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను అవమానించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గోబెల్స్ వారసుడన్నారు. పచ్చి అబద్ధాలు నిజమంటూ పదే పదే నమ్మించేందుకు కుట్రలు చేస్తున్నాడన్నారు. రిజర్వేషన్లు రద్దు చేయబోతోందంటూ బీజేపీపై విష ప్రచారం చేస్తున్నాడన్నారు. లౌకిక పదాన్ని తొలగిస్తామన్నందుకు రాజ్యాంగాన్నే మార్చబోతున్నట్లు ప్రచారం చేస్తున్నాడన్నారు. కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొంటున్నారని, ఒక్కో కార్పొరేటర్ 20 లక్షల రూపాయలిస్తే అందులో ఐదు లక్షల రూపాయలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ప్రచారం జరుగుతుందన్నారు. తక్షణమే



కొత్తపల్లి రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

బ్యాంకు లావాదేవీలపై విచారణ చేపట్టి, డబ్బులు ఇచ్చిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాను 12 వేల కోట్లతో కరీంనగర్‌ను అభివృద్ధి చేశానన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఏనాడైనా కనిపించారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పొరపాటున గెలిస్తే రైతులకిచ్చే ఎరువుల సబ్సిడీలను ఎత్తివేస్తుందన్నారు. దీంతో ఎకరాకు రైతులకు 20 వేల భారం పడుతుందన్నారు. కొత్తపల్లిలో రైతుల భూమిని తీసుకుని ఇతర వర్గం వారికి ఇచ్చారన్నారు. వారి తరుపున ప్రభుత్వంపై పోరాడి కోర్టుకుపోయి విజయం సాధించిన పార్టీ బీజేపీ అన్నారు. ముఖ్యమంత్రి నన్ను గుండుగాడు అంటున్నాడు.. గాడిద గుడ్డు చూపిస్తున్నాడు.. మరి కాంగ్రెస్ ఇచ్చిన హామీల సంగతేమైందని ప్రశ్నించారు. గాడిద గుడ్డు పేరుతో రేవంత్‌రెడ్డి చేస్తున్న డ్రామాలను ప్రజలు గుర్తించాలన్నారు. రిజర్వేషన్ల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడన్నారు. బీజేపీ 400 సీట్లు గెలిస్తే అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎంపీలు ఉండరా.. వారు రాజ్యాంగానికి వ్యతిరేకంగా మద్దతు ఇస్తారా అని అన్నారు. రాష్ట్రాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎమ్మెల్యేలు రాజ్యాంగాన్ని రద్దు చేస్తే మద్దతు ఇస్తారా అని ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ బీసీల పొట్ట కొట్టిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. మతపరమైన రిజర్వేషన్లను బీసీ గ్రూపుల్లో చేర్చి బీసీలకు అన్యాయం చేసిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, వాసాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్‌షోలో పాల్గొన్న ప్రజలు

హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

గంభీరావుపేట, మే 4: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ ఆరోపించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ సాధ్యంకాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, నాలుగు వేల రూపాయల పింఛన్, తులం బంగారం, మహిళలకు రూ.2500 వంటి హామీలు అమలు కాలేదన్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల అంశాలను ప్రస్తావిస్తూ బీజేపీని కాంగ్రెస్, బీఆర్ఎస్ బదనాం చేస్తున్నాయన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్. జిల్లా అధికార ప్రతినిధులు దేవసాని కృష్ణ, ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్‌రెడ్డి, నాయకులు పత్తి స్వామిరాజు, విగ్నేష్‌గౌడ్. రాజిరెడ్డి, రమేష్, నాగరాజు రాజు తదితరులు ఉన్నారు.

రేపు కరీంనగర్‌లో సీపీఐ సమావేశం

సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, మే 4: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సోమవారం కరీంనగర్ పార్లమెంట్ స్థాయి సీపీఐ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శనివారం సిరిసిల్ల కార్మిక భవనంలో మాట్లాడారు. మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గం కన్వీనర్ మర్రి వెంకటస్వామి, కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు హాజరుకానున్నట్లు చెప్పారు. సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, నాయకులు సోమ నాగరాజు, అజ్జ వేణు, కొంక విజయ్ పాల్గొన్నారు.

భద్రాచలం సీతమ్మకు

రంగులు మారే బంగారు చీర

- సిరిసిల్ల నేత కళాకారుడి ప్రతిభ

సిరిసిల్ల, మే 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామచంద్రస్వామికి సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు నల్ల విజయ్ చేనేత మగ్గంపై నేసిన రంగులు మార్చే బంగారు చీరను సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నల్ల విజయ్ చేనేత రంగంలో అగ్గిపెట్టెలో అమిరే చీర, ఉంగరంలో దూరే చీరతోపాటు విభిన్నమైన పట్టు చీరలు చేస్తే అబ్బురపరుస్తున్నాడు. ఇందులో భాగంగా వినూత్నంగా రంగులు మార్చే బంగారు చీరను నేశాడు. బంగారు జరీ, వెండి జరీ, రెడ్ పట్టు పూల దారాలతో 18 రోజులు శ్రమించి నేసిన పట్టు చీర మూడు రంగుల్లో కనిపిస్తుంది. 5.50 మీటర్ల పొడవు, 48 ఇంచుల వెడల్పు, 600 గ్రాముల బరువుతో ఉండే ఈ చీరను శనివారం భద్రాచలం దేవస్థానంలో ఈవో రమాదేవికి అందజేశారు. శ్రీ రామనవమి సందర్భంగా అందించే విధంగా తయారు చేసినా కొన్ని కారణాలతో అందించలేదని విజయ్ తెలిపారు.



భద్రాచలం దేవస్థానంలో బంగారు చీరను అందిస్తున్న నేత కళాకారుడు నల్ల విజయ్

బండి సంజయ్ ఒక పొలిటికల్ టూరిస్ట్

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు

కరీంనగర్ అర్బన్, మే 4: ప్రజలు ఓటేసి గెలిపిస్తే బండి సంజయ్ ఐదేళ్లపాటు అందుబాటులో లేకుండా పొలిటికల్ టూరిస్ట్‌లా వ్యవహరించారని కాంగ్రెస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు. శనివారం నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బండి సంజయ్ ఎంపీగా ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదన్నారు. . స్థానిక స్థితిగతులపై తనకు అవగాహన లేదని బండి సంజయ్ చేసిన ఆరోపణపై స్పందిస్తూ ఆయనకు చిన్న మెదడు చితికిందన్నారు. యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా తన రాజకీయ ప్రస్థానం మొదలైందని గుర్తు చేశారు. తాను సింగల్ విండో డైరెక్టర్‌గా కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రాతినిధ్యం వహించానని, 2009లో చొప్పదండి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి 30 వేల పైచిలుకు ఓట్లను సాధించానని తెలిపారు. 2009లో పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగి 1,76,000 ఓట్లు సాధించినట్టు గుర్తు చేశారు. హుజురాబాద్, సిరిసిల్ల నియోజకవర్గాల్లో జరిగిన సీఎం జనగర్జన సభలకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చి తనను ఆశీర్వదించారన్నారు. తన తండ్రి వెలిచాల జగపతిరావు కరీంనగర్‌కు



చొప్పదండిలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

చేసిన అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ కొనియాడుతున్నారని, తాను రెండు లక్షల మెజార్టీతో కరీంనగర్ ఎంపీగా గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు.



హాజరైన ప్రజలు

● బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారు

చొప్పదండి: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను తొలగిస్తారని కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. శనివారం చొప్పదండిలో నిర్వహించిన ఎన్నికల స్ట్రీట్ కార్నర్ ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు బీజేపీ కుట్రపై ఆలోచన చేయాలన్నారు. ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని కోహినూర్‌లా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ నాలుగు నెలల్లో ఎన్నో హామీలను అమలు చేశామని, మిగిలిన నాలుగున్నర సంవత్సరాల్లో అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, ఆగస్టు 15లోపు రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు. చొప్పదండి బిడ్డగా రాజేందర్‌రావు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం తిరుపతి గౌడ్, కొట్టె అశోక్, పెరుమాళ్ల గంగయ్య, పురం రాజేశం పాల్గొన్నారు.

తనిఖీల్లో 10,88,600 నగదు పట్టివేత



హుజూరాబాద్‌లో సీజ్ చేసిన నగదు

హుజూరాబాద్, మే 4: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద శనివారం ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న 10,88,600 నగదును సీజ్ చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ తెలిపారు. ఎస్ఎస్‌టీ, సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బంది చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఆ సమయంలో వేర్వేరు వాహనాల్లో వచ్చిన 9మంది వ్యక్తుల వద్ద ఎటువంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ. 10,88,600 నగదును సీజ్ చేశామన్నారు. సీఐ బొల్లం రమేశ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎవరైనా రూ. 50వేల కంటే ఎక్కువ నగదును తీసుకెళ్లకూడదని చెప్పారు. ఒకవేళ తీసుకెళ్లిన తగిన ఆధారాలు ఉండాలని తెలిపారు. ఆధారాలు లేకుంటే సీజ్ చేస్తామని తెలిపారు.

వడదెబ్బతో నలుగురి మృతి



వనమాల(ఫైల్)

చొప్పదండి, మే 4: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో శనివారం వడదెబ్బతో నలుగురు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బత్తుల భూమయ్య (55) సాయంత్రం అస్వస్థతకు గురయ్యారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపా రు. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, అధికారులు, ప్రజాప్రతిని ధులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు.

● హుజూరాబాద్‌రూరల్: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన బొల్లబోయిన వనమాల(45) అనే మహిళా కూలీ శనివారం వడదెబ్బతో మృతి చెందింది. వనమాల ధాన్యాన్ని ఆరబెట్టేందుకు వెళ్లింది. సాయంత్రం వేళ తీవ్ర అస్వస్థతకు గురికావడంతో స్థానికులు 108కు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది వనమాలను పరీక్షించగా అప్పటికే మృతి చెందిందని తెలిపారు. వనమాల భర్త శ్రీనివాస్ హమాలీ కార్మికుడుగా పని చేస్తున్నాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.





భూమయ్య, సోము(ఫైల్)

● బీర్‌పూర్: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని మంగెళ గ్రామంలోని గోండు గూడేనికి చెందిన కొమురం సోము (58)అనే గిరిజన రైతు వడదెబ్బ తగిలి శనివారం మృతి చెందాడు. సోము ఉదయం నువ్వు పంట కోసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి అలసటగా ఉందని పడుకున్నాడు. కాసేపటికి సోము భార్య వచ్చి నిద్ర లేపేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ సర్పంచ్ చుంచు శారద నరేందర్, గోండు గూడెం ప్రజలు, గ్రామస్థులు కోరుతున్నారు.


● జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన ఎండీ, రాయపోశు (71) అనే వృద్ధుడు శనివారం వడదెబ్బ తాకి మృతి చెందాడు. రాయపోశు గ్రామంలో పని నిమిత్తం బయటికి వెళ్లి ఇంటికి చేరుకున్నాడు. కాసేపటికి అస్వస్థతకు గురై మృతి చెందాడు.

వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై కేసు

జమ్మికుంట, మే 4: ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీతో ఓ యువతిని వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై శనివారం పోలీస్‌లు కేసు నమోదు చేశారు. జమ్మికుంటకు చెందిన యువతి ఇంటర్మీడియట్ చదువుకున్న సమయంలో హనుమకొండకు చెందిన సుమంత్ అనే వ్యక్తి క్లాస్‌మెట్‌గా ఉన్నాడు. దీన్ని ఆసరాగా తీసుకున్న సుమంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఫేక్ ఐడీ క్రియేట్ చేసి యువతి అన్నయ్యకు మేసేజ్‌లు పంపిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. బాధితురాలి పిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసు

హుజూరాబాద్, మే 4: హుజూరాబాద్‌లో బెల్ట్‌షాపులు నిర్వహించిన వారిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ బొల్లం రమేశ్ శనివారం తెలిపారు. ఉషకోయిల విష్ణువర్ధన్, ఆకుల తిరుపతి, కొక్కుల సత్యనారాయణలు గతంలో బెల్ట్‌షాపులు నిర్వహించగా వారిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేసి హెచ్చరిం చామని తెలిపారు. పద్ధతి మార్చుకోకుండా బెల్ట్ షాపులు నిర్వహించినందుకు వారిపై కేసు నమోదు చేసి తహసీ ల్దార్ విజయ్‌కుమార్ వద్ద బైండోవర్ చేసి, రూ. 80వేల జరిమానా విధించినట్లు వివరించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.





విద్యార్థులను ప్రోత్సహించాలి

- ఫెయిల్ అయితే నిందించొద్దు
- కలెక్టర్ పమేలా సత్పతి

హుజూరాబాద్, మే 4: విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించినప్పుడే వారు ముందుకెళ్తారని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పట్టణం లోని మైనార్టీ పాఠశాలలో శనివారం పదో తరగతి ఫెయిల్ అయిన విద్యా ర్థులు, వారి తల్లిదం డ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో ఫెయిల్ అయ్యామని చదవడం మానేస్తే అక్కడే ఆగిపోతారన్నారు. చిన్న ఉద్యోగానికైనా పదో తరగతి సర్టిఫికెట్ అవసరమన్నారు. విద్యార్థులు ఫెయిల్ అయ్యారని తిట్టకుండా వారిని ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు ఇతర పిల్లలను పోల్చుతూ ఫెయిల్ అయిన విద్యార్థులను అవమానించవద్దని సూచించారు. నాలు గేళ్లుగా చదువు మానేసిన 95మందిలో 72మంది మళ్లీ పరీక్షలు రాసి పాస్ అయ్యారని తెలిపారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఈ వో జనార్దన్‌రావు, నర్సింహస్వామి, ఆర్డీవో రమేశ్‌బాబు, తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంఈవో నర్సింహారెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

బీసీల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలి

గణేశ్‌నగర్, మే 4: బీసీల రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శ్రీధర్ రాజు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 7నహైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన మందిరంలో రాష్ట్ర స్థాయి బీసీ సదస్సు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య నాయకత్వంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జాతీయస్థాయిలో బీసీ కుల గణన జరగాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లు రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని కోరారు. రిజర్వేషన్లపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని, పార్లమెంట్ ఎన్నికలలో బీసీల మద్దతు విషయంపై చర్చ ఉంటుందని తెలిపారు. రాష్ట్ర స్థాయి బీసీ సదస్సుకు యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమస్యలపై చర్చించి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఎదుర్కోలు వేడుక

కరీంనగర్ కల్చరల్, మే 4: నగరంలోని గాంధీరోడ్ వైశ్యభవన్‌లో ఆదివారం వైశ్యసేవా కేంద్రం ఆధ్వర్యంలో వల్లీ దేవసేనాసమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని శనివారం రాత్రి గాంధీరోడ్ రామాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వల్లీ దేవసేన మాతలకు ఎదుర్కోలు వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పురాణం మహేశ్వరశర్మ, సేవాకేంద్రం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిదుర సురేశ్, పెద్ది విద్యాసాగర్, ఆర్థిక కార్యదర్శి ముస్త్యాల రమేశ్, డైరెక్టర్లు ఎలుగందుల మునీందర్, పోకల లక్ష్మీనారాయణ, కైలాస నవీన్, గౌరిశెట్టి సుమన్, రావికంటి కృష్ణకిషోర్, కొండ రాంబాబు, రామిడి శ్రీధర్, మాడూరి మల్లేశం, కల్చరల్, డివిషనల్ కో ఆర్డినేటర్ నలుమాచు చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి షిర్డీసాయి భక్త భజనమండలి ఆధ్వర్యంలో మణిద్వీపవర్ణన, హనుమాన్ చాలీసా పారాయణాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 10-30 గంటల నుంచి కల్యాణం, హనుమాన్ భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు.



ఎదుర్కోలు వేడుకలో పాల్గొన్న భక్తులు



సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి







రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఇల్లంతకుంట, మే 4: మండల కేంద్రానికి చెందిన చేరాల శ్రీనివాస్ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో శనివారం గాయపడ్డాడు. ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్లి తిరిగి ఇల్లంతకుంటకు వస్తుండగా వెంకట్రావుపల్లె సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో శ్రీనివాస్‌కు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు సిరిసిల్ల ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు.

వృద్ధురాలి ఆత్మహత్య


దేవవ్వ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మే 4: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో అనారోగ్య సమస్యలు భరించలేక వృద్ధురాలు బాధ దేవవ్వ(85) వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని దేవవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. కొడుకు బాలలింగం వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తోంది. ఓ వైపు అనారోగ్యం.. మరో వైపు వృద్ధాప్యంతో మనస్థాపానికి గురైంది. శుక్రవారం ఇంటిలో నుంచి బయటకు వెళ్లిన దేవవ్వ చీకటి పడినా తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో శనివారం శవమై తేలింది. అటు వైపు వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. స్థానికుల సహాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతురాలు కొడుకు బాలలింగం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య


ఎల్లయ్య (ఫైల్)

చందుర్తి మే 4: ఒంటరితనం భరించలేక ఓ వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో శనివారం ఈ ఘటన వెలుగు చూసింది. గ్రామస్థుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన కొమ్ము ఎల్లయ్య (70) భార్య, పిల్లలు లేకపోవడంతో పాటు వృద్ధాప్య భారంతో జీవితంపై విరక్తి చెంది వారం రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకొని మృతి చెందాడు. శనివారం తునికి ఆకు సేకరణకు వెళ్లిన గ్రామస్థులకు కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేందుకే సఖీ సెంటర్

● జగిత్యాల కోర్టు న్యాయాధికారి ప్రసాద్


సఖీ కేంద్ర నిర్వాహకులతో న్యాయమూర్తి ప్రసాద్

జగిత్యాల టౌన్, మే4 : మహిళలు సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం సఖీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జగిత్యాల కోర్టు న్యాయాధికారి ప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులో ఉన్న సఖీ కేంద్రంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. న్యాయమూర్తి ప్రసాద్ హాజరై మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న మహి ళలను అన్ని విధాలా ఆదుకునే చోటుతో పాటు గృహ హింస, వేధింపులు, దాడులు, ప్రమాదాలకు గురైన మహిళలకు తక్షణ న్యాయ సహాయం అందించడమే సఖీ కేంద్ర లక్ష్యమన్నారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ అధికారి వాణిశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, లీగల్ ఏయిడ్ కౌన్సిల్స్ న్యాయవాదులు చంద్రమోహన్, సతీష్, విజయ్ కృష్ణ, సఖీ అడ్మినిస్ట్రేషన్ మనీల, అశ్విని, జిల్లా లీగల్ సర్వీసెస్ సూపరింటెండెంట్ వెంకన్న, సిబ్బంది జాన్సన్ ఉన్నారు.

● ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు ప్రభుత్వం తరపున ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు జగిత్యాల కోర్టు న్యామూర్తి ప్రసాద్ పేర్కొన్నారు. జగిత్యాల సబ్ జైలును శనివారం న్యాయమూర్తి ప్రసాద్ సందర్శించారు. ఖైదీలకు అం దుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీ లు సత్ ప్రవర్తనతో మెదలాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై తప్పనిసరిగా అవగాహన పెంచుకోవాలని సూచించారు. లీగల్ ఏయిడ్ కౌన్సిల్స్ న్యాయవా దులు చంద్రమోహన్, సతీష్, విజయ్ కృష్ణ, జైలర్ మొగిలేష్ తదితరులు ఉన్నారు.

ఆటోకు నిప్పు పెట్టిన దుండగులు


మంటల్లో కాలిపోయిన ఆటో

కోరుట్ల, మే 4: పట్టణంలోని ఝాన్సీ రోడ్డులో శుక్రవారం ఆర్థరాత్రి మ్యాజిక్ ఆటోకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితుడు బొలిశెట్టి నరేందర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నరేందర్ ఇంటి సమీపంలో ఆటోను ఉంచి ఇంట్లో నిద్రిస్తు న్న సమయంలో సుమారు 3 గంటల ప్రాంతంలో ఆటోలో మంటలు ఎగిసి పడుతుండగా గుర్తించి చుట్టు పక్కలవారి సాయంతో మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. స్థానికుల సహాయంలో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది మంటలను ఆర్పివేశారు. బాధితుడు నరేందర్ పోలీసులతో పాటు అగ్నిమాపక సిబ్బంకి ఫిర్యాదు చేశాడు. కాలనీలో పలువురిపై అనుమానం ఉన్నట్లు నరేందర్ ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలన జరిపి ఆకోణంలో విచారణ చేపట్టారు.

చెరువు మట్టి తవ్వకాలను అడ్డుకున్న అధికారులు


మట్టి తవ్వకాలు చేస్తున్న జేసీబీ

మల్యాల, మే 4: మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో గల కొత్త చెరువు నుంచి కొందరు అక్రమంగా మట్టి తరలిస్తుండగా అధికారులు అడ్డున్నారు. నాలుగు రోజులుగా మట్టి తరలిస్తుండడంతో గ్రామస్థులు శనివారం ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. జేసీబీతో తవ్వకాలు చేప డుతూ మట్టి తరలించడంపై చర్యలు తీసుకోవాలని కోరగా ఇరిగేషన్ సిబ్బంది అక్కడకు చేరుకొని జేసీబీని పట్టుకున్నారు. అయితే సిబ్బందిని అడ్డగించి దాన్ని పట్టుకెళ్లిన్నట్లు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో చెరువు వద్ద పరిశీలించారు. అనుమతులు లేకుండా సాగుతున్న ఈ వ్యవహారంపై చర్యలు తీసుకొని మరోసారి పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దేశ భద్రత, భవిష్యత్‌కు సంబంధించిన ఎన్నికలు

● భారత్‌పై దాడి చేయాలనే ఆలోచనను తుంచిన నేత మోదీ ● ప్రజ్ఞాభారతి సదస్సులో బండి సంజయ్


సదస్సులో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 4: ఈ ఎన్నికలు దేశ భద్రత, భవిష్యత్‌కు సంబంధించిన ఎన్నికలు అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి నగరంలోని సీతారాంపూర్‌లో ప్రజ్ఞాభారతి మేధావులు నిర్వహించిన 'ప్రగతి పథంలో భారత దేశం' అనే సదస్సులో ఆయన మాట్లాడుతూ సర్జికల్ స్ట్రయిక్స్‌తో టెర్రరిస్టుల వెన్నులో వణుకు పుట్టించిన నేత మోదీ అని అన్నారు. దేశ భవిష్యత్తు భద్రత విషయంలో స్పష్టమైన విజన్ ఉన్న మహనేత నరేంద్రమోదీ అన్నారు. విజన్‌తో పాటు ఇజం లేని పార్టీ కాంగ్రెస్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో ముగ్గురు అభ్యర్థులను బేరీజు వేసుకుని ఓటు వేయాలన్నారు. కరీంనగర్‌లో 12 వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామన్నారు. మీరంతా మేధావులు ప్రతి అంశాన్ని లోతుగా ఆలోచించి సమాజానికి ఏది మంచిదో చెప్పే వారు మీరన్నారు. బీజేపీ పక్షాన ప్రధాని అభ్యర్థిగా బరిలో దిగుతున్న మోదీని చూసి బీజేపీ సిద్ధాంతాలను విధానాలను చూసి ఓటేయాలన్నారు. కాంగ్రెస్ కూటమికి ప్రధాని అభ్యర్థి లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా పోటీ చేసే స్థానాలే 310కి మించడం లేదని మరి అధికారంలోకి ఎలా వస్తుందన్నారు. 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, అయోధ్య రామమందిర నిర్మాణం వంటి చర్యలతో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటే గర్వంగా భావించా అన్నారు. జవాన్లకు మనోధైర్యం కల్పించేందుకు సియాచిన్ దేశ సరిహద్దులకు పోయి ప్రతిఏటా దీపావళి పండుగ జరుపుకుంటూ మనోనిబ్బరాన్ని కలిగిస్తూ మోదీ దేశరక్షణ రంగాన్ని పటిష్టం చేస్తున్నారన్నారు. విదేశాంగ విధానంలో ప్రపంచంలోనే భారత్‌నెంబర్‌వన్‌గా ఉండేలా చేస్తున్నారన్నారు. కరోనాతో సమయంలో ఆత్మనిర్భర భారత్ ప్యాకేజీతో దేశాన్ని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారన్నారు.

వేద విజ్ఞానం విస్తరిల్లిన పుణ్యభూమి భారతదేశం

● కరీంనగర్ కల్చరల్: ప్రపంచంలో నాగరికత కన్ను తెరువకముందే వేద విజ్ఞానం విస్తరిల్లిన పుణ్యభూమి భారతదేశమని కాలమిస్టు, రచయిత, రాజకీయ విశ్లేషకుడు, రామాయణ పాఠశాల స్థాపకుడు శంతన్‌గుప్తా అన్నారు. శనివారం ఆర్‌బీవిఆర్ రెడ్డి పంక్షన్ హాల్‌లో ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో 'ఎమర్జింగ్ భారత్' అంశంపై సెమినార్, ఆయన రాసిన '101 కారణాలు' పుస్తకంపై సమీక్షకు ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. దేశం ఐదవ ఆర్థిక శక్తిగా మారి విశ్వ గురువు స్థాయికి చేరుకుందని అన్నారు. ప్రజ్ఞాభారతి చైర్మన్ డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, ప్రధాన కార్యదర్శి మందల నగేశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజనాచారి పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల,మే 4: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.

కొండగట్టు ఈవో సస్పెన్షన్‌పై మధ్యంతర ఉత్తర్వులు

మల్యాల, మే 4: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో వెంకటేష్‌పై గత మార్చి 23న దేవాదాయ కమిషనర్ సస్పెన్షన్ వేటు వేయగా హైకోర్టు ఆ సస్పెన్షన్‌పై ఇంటీరియం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఉద్యోగి ఒకరు దేవస్థానం సొమ్ముల దుర్వినియోగంపై నిర్లక్ష్యం, అలసత్వంగా వ్యవహరించారని పేర్కొంటూ ఈవో వెంకటేష్‌పై సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడంతో వెంకటేష్ హైకోర్టును ఆశ్రయించారు. సొమ్ముల దుర్వినియోగంకు పాల్పడిన సదరు ఉద్యోగిని సస్పెండ్ చేయడంతో పాటు పోలీస్ కేసు నమోదు చేయడం జరిగిందని కోర్టుకు విన్నవించారు. తాను కొండగట్టులో చేరకముందు జరిగిన వ్యవహారంగా కోర్టుకు తెలుపడంతో న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ ఆయన ప్రస్తుత డీసీ స్థాయి పోస్టులో నియమించుకోవచ్చునని పేర్కొంది. తదుపరి విచారణ జూన్ 27కు వాయిదా వేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలి

తంగళ్లపల్లి, మే 4: ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని ఎస్ఐ సుధాకర్ కోరారు. శనివారం తంగళ్లపల్లి మండలంలోని సమస్యాత్మక గ్రామాలు తాడూరు, తంగళ్లపల్లి, మండెపల్లి గ్రామాలలో పోలీస్ కవాతు నిర్వహించారు. అనంతరం ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరగకుండా సహకరించారని అదే విధంగా ఈ ఎన్నికలు కూడా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మండలంలో మొత్తం 50 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని దీంట్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న గ్రామాలలో కేంద్ర బలగాలతో పాటు కవాతు నిర్వహించి ఎన్నికల పట్ల అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో పార్టీల నాయకులు, యువకులు, ప్రజలు ఎన్నికల నియామావళిని ఉల్లంగించకుండా ప్రచారం నిర్వహించుకోవాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుల్‌లు సాంబశివరావు, సుధాకర్, మల్లేశం, కానిస్టేబుల్‌లు నరేందర్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్,రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ప్రజాపాలన అమలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ నారాయణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4: ప్రజాపాలన అమలు చేసే ప్రభుత్వాలను ఎన్నుకోవాలని ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ కూరపాటి వెంకట్ నారాయణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ బడా వ్యాపారులకు అండగా ఉంటున్నారని విమర్శించారు. 10 శాతం జనాభా కూడా లేని ధనవంతులకు దేశ సంపదలో 72శాతం సమకూర్చారని అన్నారు. ప్రతి వార్షిక సంవత్సర ఆదాయం కేవలం ఒక్క శాతం ప్రజలకు 25శాతం ఆదాయం దక్కుతున్నా, దేశం వెలిగిపోతుందని, ప్రకాశిస్తుందని డంబాచారం చేయడం పేద ప్రజలను అగౌరవపరచడమేనని ఎద్దేవా చేశారు. నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్‌పై వేసిన జీఎస్టీ కారణంగా చిరు వ్యాపార వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని అన్నారు. మోదీ పాలనలో అదానీ, అంబానీ, వేదాంత లాంటి ధనవంతులకే ప్రయోజనాలు కలిగే విధంగా మేలు చేస్తున్నారని ఆరోపించారు. సమాజ అభివృద్ధికి తోడ్పడే విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ రంగాలను మోదీ పాలనలో నర్వీర్యం చేశారన్నారు. గత పది సంవత్సరాల నుంచి కేంద్రం చిల్లి గవ్వ చెల్లించకపోవడం వల్ల కళాశాలలు, యూనివర్శిటీలు, పెద్ద పెద్ద విద్యా సంస్థలు మూసివేతకు సిద్ధంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు విద్యాలయాలకు లక్షల రూపాయల ఫీజు చెల్లించి, పట్టాలు పొందిన యువతీ యువకులు ఉపాధి, ఉద్యోగాలు లభించని దేశాన్ని సంపన్న దేశంగా ఏ విధంగా అంటారని ప్రశ్నించారు. జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మెన్ డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ ప్రతి దశాబ్దానికి ఒకసారి లెక్కలు చేసే విధానాన్ని మోదీ ప్రభుత్వం నిలిపివేసిందని ఆరోపించారు. పేద వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను తెలియచేసే జనాభా లెక్కలు ఉద్దేశపూర్వకంగా, కుట్ర పూరితంగానే మోదీ ప్రభుత్వం ఆపివేసిందని అన్నారు. దీనికి బీజేపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. జనగణన చేయని మోదీకి జనగనమన పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. దేశంలో పేదలందరికీ విద్యా, వైద్యం అందించేలా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ నీలం సంపత్‌కుమార్, డాక్టర్ ఎదులాపురం తిరుపతి, డాక్టర్ వంగాల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీకి ఓటు వేయకపోతేనే దేశానికి భవిష్యత్

● రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

● జగిత్యాలకు చేరుకున్న జాగో తెలంగాణ బస్సుయాత్ర



జగిత్యాలలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

జగిత్యాల అర్బన్, మే 4: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీకి ఓటు వేయకపోతేనే ఈ దేశానికి భవిష్యత్ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామ్య వేదిక బాధ్యులు, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చే విధంగా సాగుతున్న ప్రజా వ్యతిరేక, ఫాసిస్టు విధానాలను నిరసిస్తూ ఓటు వేసే ముందు మతోన్మాద పాలకవర్గాల పార్టీల స్వభావాన్ని గుర్తించాలనే నినాదంతో ప్రజలను చైతన్య పర్చేందుకు ప్రారంభించిన బస్సుయాత్ర శనివారం జగిత్యాల జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక సామాజిక ఉద్యమకారులు బస్సు యాత్రకు స్వాగతం పలకగా, స్థానిక పాత బస్టాండ్ చౌరస్తా వద్ద ఓటరు అవగాహన కార్యక్రమంతో పాటు, విద్వేష విభజన, నియంతృత్వ అప్రజాస్వామిక రాజకీయాలు చేస్తున్న వారిని ఓడించాలని యాత్ర ద్వారా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఐఏఎస్ మురళి మాట్లాడుతూ గత పాలకులైన బీఆర్ఎస్ అధినేత పాలనపై కూడా తీర్పు ఇవ్వాలని గతంలో ఈ యాత్ర చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికలు కేంద్రానికి సంబంధించినవి గనుక పదేళ్లుగా ఈ దేశాన్ని పాలిస్తున్న మోదీ పాలనపై తీర్పు ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మోదీ పాలన, ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను వివరించేందుకే జగిత్యాలకు రావడం జరిగిందన్నారు. ప్రతిపక్షాలను విమర్శించడమే తప్ప, ఆయన చేసింది చెప్పడని మోదీపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ రాష్ట్రం నుంచి సుమారు 12లక్షల కోట్ల రూపాయలు కేంద్రానికి చెల్లిస్తే, రాష్ట్రంలో కేంద్రం నుంచి విడుదల చేసిన నిధులతో ఒక్క బడి, ఒక ఆసుపత్రి, పేదలకు ఇళ్లు కట్టించాడా? ఉద్యోగాలు యువతకు ఇచ్చాడా అనేది అడగాల్సిన సమయం ఇదేనన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి, పేదళ్లలో 20కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా ఎన్ని ఉద్యోగాలు కేంద్ర ప్రభుత్వం కల్పించిందో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. బీజేపీ సంపన్న వర్గాలకు సేవచేసే పార్టీ మాత్రమే తప్ప, పేదలకు న్యాయం చేయదని మండిపడ్డారు. బీసీ ప్రధాన మంత్రి అయ్యి ఉండి, బీసీల కులగణన ఎందుకు చేయడని ఆయన ప్రశ్నించిన ఆయన, 2శాతం ఉన్న అగ్రవర్ణాలకు పది శాతం రిజర్వేషన్‌లు ఇచ్చి, 50శాతం పైగా ఉన్న బీసీలకు కేవలం సగం మాత్రమే రిజర్వేషన్‌లు కేటాయించడం వెనుక ఆంతర్యం ఏంటని మురళి ప్రశ్నించారు. కార్యక్రమంలో యాత్ర సభ్యులు లక్ష్మీ నారాయణ, హన్మాష్, నైనాల గోవర్ధన్, పద్మజషా, డాక్టర్ జగదీశ్వర్, శ్రీకాంత్, తిరుపతి, సౌజన్య, గౌస్, అంజి, బాలు, కల్పనతో పాటు స్థానిక సామాజిక సంఘాల నాయకులు బండ శంకర్, చెనాల సుమన్, పల్లె రమేష్, మెరుగు స్వామి తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాల టౌన్, మే 4: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో జరిగింది. పురాణీపేటకు చెందిన బింగి నవీన్(35)కు జ్యోత్స్నతో వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య తగాదాలు ఏర్పడడంతో నవీన్‌పై నెల రోజుల క్రింతం వరకట్నం కేసు నమోదైంది. అప్పటి నుంచి ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్న నవీన్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకని ఆత్మహత్యకు పాల్ప డ్డాడు. జగిత్యాల టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, మే 4: కరీంనగర్‌లో మద్యం సేవించి వాహనా లు నడిపి పట్టుబడిన 12 మంది వ్యక్తులను కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు శనివారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ ఇద్దరు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, రూ.4,500ల జరిమానా విధించారని ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. మిగతా 10 మంది వ్యక్తులకు 16 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

లారీల కొరత తీర్చాలని రైతుల నిరసన

కోనరావుపేట, మే 4: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామంలో లారీలు రాక కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు పేరుకపోయాయని లారీల కొరత తీర్చాలని శనివారం రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సంద ర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి పది రోజులు గడుస్తున్నా ధాన్యం తరలించడం లేదని అన్నారు. దీని వల్ల ధాన్యం బస్తాల వద్ద రాత్రిపూట కాపలా కాయాల్సి వస్తుందని అన్నారు. లారీలు రాక ధాన్యం తరలించడం లేదని అన్నారు. అధికారులు స్పందించి లారీల కొరతను తీర్చి వెం టనే తరలించాలని కోరారు.

వేముల రోహిత్ కేసును మళ్లీ విచారించాలి

భగత్‌నగర్, మే 4: వేముల రోహిత్ కేసును మళ్లీ విచారించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఫ్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రోహిత్ కేసులో జాప్యం లేకుండా పునర్విచారణ చేపట్టి నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మచ్చ రమేష్, జేరిపోతుల జనార్ధన్, అక్రమ్, రేణికుంట్ల ప్రీతం, సంగెం మధు, రామారపు వెంకటేష్, రంజిత్, మామిడిపల్లి హేమంత్, చాట్ల సమ్మయ్యకనకంసాగర్, సాయి ఆజాద్ పాల్గొన్నారు.

తప్పుడు రిజిస్ట్రేషన్ కేసులో ఇద్దరి అరెస్టు


నిందితులను అరెస్టు చేస్తున్న కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్

కరీంనగర్ క్రైం, మే 4 : అప్పుగా డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడమే గాక, ఆ డబ్బులకుగాను వేరొకరికి చెందిన ఇంటి స్థలాన్ని అసలు యజమానికి బదులుగా మరొక వ్యక్తిచేత తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్‌కుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం మంగలపల్లికి చెందిన గంప రమాదేవి కుటుంబం బతుకుదెరువు నిమిత్తం కరీంనగర్‌లో 2013 నుంచి 2018 వరకు కిరాణం షాపు ఏర్పాటు చేసుకుని నివసించారు. ఆ సమయములో ఆమె గ్రామానికి చెందిన దేవసాని శ్రావణ్‌కుమార్, తన బంధువైన గుంటుకల తిరుపతి రూ..2 లక్షల రూపాయలు అప్పు కావాలని అడగగా తిరుపతి అనే వ్యక్తికి 2014 సంవత్సరంలో 2 లక్షలు అప్పు ఇచ్చింది. ఒక ఏడాది వరకు తిరిగి ఇస్తానని చెప్పిన తిరుపతి తిరిగి డబ్బులు ఇవ్వలేదు. దీంతో శ్రావణ్‌కుమార్, తిరుపతిలను డబ్బులు ఇవ్వమని రమాదేవిని ఒత్తిడిచేయగా దేవసాని శ్రావణ్ కుమార్, గుంటుక తిరుపతిలు డబ్బులకు బదులుగా కరీంనగర్ తీగలగుట్టపల్లె శివారులో సర్వే నెం. 252లో ప్లాట్ నెం. 8 విస్తీర్ణము 248 చదరపు గజముల స్థలం ఉందని, ఈ స్థలం విద్యానగర్‌కు చెందిన పటేల్ సుధీర్ పేరిట ఉందని, ఆ స్థలాన్ని విక్రయిస్తానని చెప్పారు. వారి మాటలు నమ్మిన రమాదేవి ఆ స్థలానికి 15 లక్షల ధర నిర్ణయించారు. ఆ స్థలాన్ని పటేల్ సుదీర్‌తో రిజిస్ట్రేషన్ చేపిస్తానని చెప్పిన దేవసాని శ్రావణ్ కుమార్, గుంటక తిరుపతిల మాటలు నమ్మి వారికి అప్పుగా ఇచ్చిన 2 లక్షల రూపాయలు మినహాయించుకుని మిగతా 13 లక్షల రూపాయలు ముట్టజెప్పింది. ఆ తర్వాత 2017 ఫిబ్రవరి 2న రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా శ్రావణ్‌కుమార్, గుంటుక తిరుపతిలు పటేల్ సుదీర్‌కు బదులుగా రాంనగర్‌కు చెందిన పోరండ్ల శ్రీనివాస్‌ను ఆ స్థలం అసలు యజమానైన పటేల్ సుదీర్‌గా చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారు. ఇదిలా ఉండగా 2021లో రమాదేవి తన స్థలంలో బేస్‌మెట్ నిర్మించేందుకు వెళ్లగా అక్కడికి భోగ నవీన్ అనే వ్యక్తి వచ్చి ఇది నా ప్లాట్ అని, డాక్యుమెంట్లు చూపించాడు. అందులో పటేల్ సుధీర్ అమ్మినట్లుగా ఉంది. కాని ఫొటోలో ఉన్న వ్యక్తి ఇద్దరి డాక్యుమెంట్లలో వేరువేరుగా ఉన్నారు. అప్పుడు దీనిపై ఆరా తీయగా శ్రావణ్, తిరుపతిలు రమాదేవిని మోసం చేయాలనే ఉద్దేశ్యముతో పోరండ్ల శ్రీనివాస్‌ను తీసుకొచ్చి పటేల్ సుధీర్‌గా చూపించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించారని తెలిసింది. ఈ మేరకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టిన కరీంనగర్ రూరల్ సీఐ ఏ ప్రదీప్ కుమార్ , బాధితురాలు ఫిర్యాదులో తెలిపిన విషయాలు నిజమేనని వెల్లడైనందున ఇద్దరిపై ఐపీసీ సెక్షన్ 419, 420, 467, 468, 506, 471, 120బి రెడ్‌విత్ 34 కింద కేసు నమోదు చేశారు. నిందితులు ఇద్దరిని శనివారం అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా కేసును పరిశీలించిన మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించగా నిందితులను కరీంనగర్ జైలుకు తరలించారు.

అగ్ని ప్రమాద బాధితులను అదుకోవాలి


అగ్నిప్రమాదానికి గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మెట్‌పల్లి రూరల్, మే4: మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతు, గీత కార్మికులను ప్రభుత్వం, అధికారులు అదుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. అగ్ని ప్రమా దానికి గురైన పొలాలు, ఈత వనాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. బాధితులకు నష్ట పరిహారం అందజేయాలని సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వంతుగా తక్షణ సహాయం కింద రైతు వెంగంటి శ్రీనివాస్‌గౌడ్‌కు రూ. 10వేలు, గీత కార్మికులకు రూ. 50వేల ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చి ప్రభుత్వం తరుపున నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానన్నారు. నాయబ్ తహసీల్దార్ రాజ్‌మహ్మద్, ఎక్సైజ్ ఇంచార్జి సీఐ ప్రదీప్ రావులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల నుంచి అధికారులు ఫిర్యాదు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పుల్ల జగన్ గౌడ్, డాకూరి వెంకటేష్, ముదాం నర్సింహులు, వెంగంటి లక్ష్మణ్‌గౌడ్, రైతులు, గీత కార్మికులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి


పనులు పరిశీలిస్తున్న జాయింట్ కమిషనర్

ఇల్లంతకుంట, మే 4: జాబ్‌కార్డులు ఉన్నవారందరూ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రహీంఖాన్‌పేట సింగరాయకుంటలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం రాష్ట్రబృందం సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, పనులు జరిగే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. డీఆర్డీవో శేషాద్రి, కమిటీ సభ్యుడు అభయ్‌కుమార్, ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో చంద్రయ్య, ఈసీ అర్షద్, డీఆర్పీ తిరుమలేష్, కార్యదర్శి సంధ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమన్వయంతో బెంచ్ నడిపించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

సిరిసిల్ల క్రైం, మే 4: సమన్వయంతో బెంచ్ నడిపించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ హాలులో నూతనంగా బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తులు, న్యాయవాదులకు మధ్య పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బార్ అండ్ బెంచ్ మధ్య స్నేహపూరిత వాతావరణం కలిగి ఉండాలన్నారు. సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్, రెండో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి గడ్డం మేఘన, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డోర్నాల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శి టి. వెంకటి, ఉపాధ్యక్షులు దుర్గారెడ్డి, లైబ్రరీ కార్యదర్శి శశాంకం, మహిళా ప్రతినిధి పుష్పలత, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● ఈ నెల 6 నుంచి కోర్టులకు సెలవులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని జిల్లా కోర్టు, సిరిసిల్ల, వేములవాడ సీనియర్ సివిల్ కోర్టులకు ఈనెల 6నుంచి 31వరకు హైకోర్టు సెలవులు ప్రకటించింది. సిరిసిల్ల, వేములవాడ జూనియర్ సివిల్ కోర్టులకు ఈనెల 13నుంచి 31వరకు సెలవులు ఉన్నట్లు హైకోర్టు వెల్లడించింది. ఈ సెలవుల్లో సివిల్ కేసులను విచారణ ఉండదు. కేవలం క్రిమినల్, ఆర్‌టీఏ యాక్ట్, ఫ్యామిలీ కోర్టు కేసులను మాత్రమే విచారణ చేస్తారు. అత్యవసరంగా ఏదైనా సివిల్ కేసు దాఖలు చేయాల్సి వస్తే వెకేషన్ కోర్టు ద్వారా వేసుకోవచ్చు. ఈ వేకేషన్ కోర్టు కేసులను జిల్లా స్థాయి జడ్జి చూసే అవకాశం ఉంది.

దంచి కొడుతున్న ఎండలు





నిర్మానుష్యంగా గాంధీచౌక్

- పగటి వేళల్లో నిర్మానుష్యంగా రద్దీ ప్రదేశాలు
- వడదెబ్బతో ఇప్పటికి నలుగురు మృతి
- వడగాలులతో ప్రజలు ఉక్కిరి..బిక్కిరి
- జిల్లాలో ఆరెంజ్ అలర్ట్
- 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

దంచి కొడుతున్న ఎండలతో జిల్లా కేంద్రంతోపాటు వేములవాడ, ఇతర మండల కేంద్రాల్లో మధ్యాహ్నం వేళ కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తోంది. ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి. ఉదయం పది గంటల తరువాత ఇళ్లలో నుంచి కాలు బయటపెట్టడానికి జనం జంకుతున్నారు. రెండు రోజులుగా సిరిసిల్ల, ఇల్లంతకుంట మండలాలు రెడ్ అలర్ట్‌లో కొనసాగాయి. శనివారం మాత్రం జిల్లా మొత్తం ఆరెంజ్ జోన్‌గా ప్రకటించారు. జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 37.5, గరిష్ఠ ఉష్ణోగ్రత 44.4 డిగ్రీలుగా నమోదైంది. వడగాలుల తీవ్రత పెరిగింది. ఇంట్లో ఉన్నా ఉక్కపోతతో ఉక్కిరి..బిక్కిరి అయ్యారు. జిల్లాలోని



వెలవెలబోతున్న మార్కెట్ ఏరియా

సిరిసిల్లలో 44.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా ఇల్లంతకుంటలో 44.2, గంభీరావుపేట, వీర్నపల్లి 44.0, రుద్రంగి 43.9, వేములవాడ రూరల్ 43.6, ముస్తాబాద్, బోయినపల్లి 43.5, వేములవాడ 43.3 తంగళ్లపల్లి 43.1, కోనరావుపేట 42.8, ఎల్లారెడ్డిపేటలో 42.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమదయ్యాయి. ఎండ తీవ్రతకు తట్టుకోలేక జిల్లాలో ఇప్పటి వరకు వడదెబ్బతో నలుగురు మృతి చెందారు. చందుర్తిలో మట్కం గంగారాం, లింగంపల్లి మొగ్గవ్వ, వేములవాడ రూరల్ మండలంలో నాగుల బాలయ్య, శంకర్ మరణించారు. ఎండ తీవ్రతకు వృద్ధులు అస్వస్థతకు గురవుతున్నారు.

● మధ్యాహ్నం వ్యాపారాలు వెలవెల

ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో జిల్లా కేంద్రానికి వివిధ మండలాల నుంచి ప్రజలు రావడం తగ్గిపోయింది. జిల్లా కేంద్రం, మండల కేంద్రాల్లో మధ్యాహ్నం వేళల్లో ప్రజలు ఇంటికే పరిమితం అవుతుండడంతో వ్యాపార సంస్థలు, దుకాణాలు వెలవెలబోతున్నాయి. సాయంత్రం వేళల్లో కొద్దిమేరకే రద్దీ కనిపిస్తోంది.

● ప్రచారాల జోరకు బ్రేక్

లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి కూడా ఎండలు బ్రేక్ వేస్తున్నాయి. ఉదయం 9 గంటల వరకే ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున ప్రచారం చేస్తున్నారు. సాయంత్రం వేళ ఆరు తర్వాత మళ్లీ ప్రచారానికి వెళ్తున్నారు. ఎండ తీవ్రతతో ఎన్నికల ప్రచార సందడి కనిపించడం లేదు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో దళిత ఆత్మీయ సమ్మేళనం

ఇల్లంతకుంట, మే 4: మండల కేంద్రంలోని వైశ్యభవనంలో శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో దళిత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితుల హక్కుల సాధనకు కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గతంలో ఎస్సీఎస్టీ సబ్‌ప్లాన్ తెచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ద్వారానే దళితుల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఎస్సీసెల్ అధ్యక్షుడు మచ్చ రాజేశం, నాయకులు బడుగు లింగం, శంకర్, సంపత్, మామిడి నరేష్, కాసుపాక శంకర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ నాయకులు

చందుర్తి, మే 4 : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామ కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నేదూరి రవి, కాంగ్రెస్ నాయకులు బొడిగె శంకరయ్య, కత్తి చంద్రయ్య శనివారం బీజేపీలో చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిరికొండ శ్రీనివాస్, మార్త సత్తయ్య, పొంచెట్టి రాకేష్, చిర్రం తిరుపతి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి సన్మానం

కరీంనగర్ క్రైం, మే 4: అంతర్జాతీయ అగ్నిమాపక దళ దినోత్సవాన్ని పురస్కరించుకుని శాతవాహన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అగ్నిమాపకశాఖ అధికారులు, సిబ్బందిని శనివారం సన్మానించారు. కరీంనగర్ ఫైర్ స్టేషన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి డి ప్రభాకర్, ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ ఎం గుండయ్య, సిబ్బంది పి లక్ష్మారెడ్డి, పి సందీప్‌కుమార్, కె భిక్షపతి, ఎన్ సుందరయ్యను శాతవాహన లయన్స్‌క్లబ్ బాధ్యుడు మధుసూదన్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

చింతకుంటలో కాంగ్రెస్ నాయకుల ప్రచారం

కథలాపూర్, మే 4 : మండలంలోని చింతకుంటలో శనివారం కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. గ్రామ శివారుల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు వెళ్లి అక్కడ పనిచేస్తున్న సుమారు 800 మందిని ఓటు అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తుందని ఆదరించాలని కోరారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి ఆరు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ సభ్యులు చెదలు సత్యనారాయణ, కట్ట శంకర్, వంద మహేశ్, తోట నరేశ్, మేకల మల్లేశం, కొప్పుల గంగారెడ్డి, బొదాసు నర్సయ్య, కొప్పుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గురువును సన్మానించిన పూర్వ విద్యార్థులు

కొడిమ్యాల, మే 4 : మండలంలోని పూడూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రధానోధ్యాయుడు పైడిపల్లి శ్రీ రంగారావుదంపతులను శనివారం ఐదు దశా బ్దాల తర్వాత పూర్వ విద్యార్థులు ఆయన స్వగృ హంలో కలిసి జ్ఞాపికను అం దించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. 1974లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మాన కొండూర్ పాఠశాలలో శ్రీరంగారావు ఉపాధ్యాయుడిగా పని చేశారు. అదె సమయంలో పదవ తరగతి చదివిన విద్యార్థులు గత నెల 28న మానకొండూర్‌లోని కె.ఎస్ కన్వెన్షన్‌లో గోల్డెన్ జూబ్లీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. ఆ సమయంలో తమకు విద్యా బుద్దులు నేర్పిన మండలం లోని పూడూర్ గ్రామానికి చెందిన గురువు శ్రీరంగారావు అనారో గ్యంగా ఉన్న కారణంగా హాజరు కాలేదు. 50 సంవత్సరాల తర్వాత గురువు మీద ఉన్న ప్రేమ, గౌరవంతో పూర్వ విద్యార్థులు గంద్ర రాజేంద్రప్రసాద్, మడపతి నరేందర్ రావు, మహేమని రామయ్య వచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు గుడిపల్లి భూమరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబ ఆలయ వార్షికోత్సవం

మెట్‌పల్లి, మే, 4 : పట్టణంలోని సాయిరాం కాలనీల్లోన సాయిబాబా ఆలయం 13వ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయం నిర్మాణ దాత తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీనివాస్‌రెడ్డికి పురోహితులు ఆశీర్వదనాలు అందజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారి పల్లకి సేవ, భజన కార్యక్రమాలను నిర్వహకులు, భక్తులు చేపట్టినంతరం హారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి నిర్వహకుడు మహాజన్ నర్సింహులు, ఏనుగందుల చుక్కయ్య, మంచాల రవీందర్, దొంతుల రాజ్‌కుమార్, గుండా గణేష్, మాటేరి రాజమౌళి, క్యాతం రఘుపతిరెడ్డి, నాగేశ్వరరావు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీ మృతి

తంగళ్లపల్లి, మే 4: తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో ఉపాధి హామీ కూలీ పొన్నం సత్తయ్య(78) మృతిచెందాడు. శనివారం ఉదయం 6 గంటలకు ఉపాధి హామీ పనులకు వెళ్లాడు. 9.30 గంటల వరకు పనులు నిర్వహించాడు. తోటి కార్మికులందరూ వెళ్లిపోగా బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి మధ్యాహ్నం నర్సరీ వద్ద శవమై కనిపించాడు. సత్తయ్యకు అనారోగ్య సమస్యలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

దేశ సంపద అదాని, అంబానీలకు దోచి పెడుతున్న బీజేపీ ప్రభుత్వం

చందుర్తి, మే 4: బీజేపీ ప్రభుత్వం దేశంలోని సంపద మొత్తం అదాని, అంబానికి దోచి పెడుతోందని, పదేళ్ల పాలనలో పేదలు మరింత పెదలుగా మారారని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి, మర్రిగడ్డ, జోగాపూర్, బండపల్లి, ఎనగల్ గ్రామాల్లో కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్గల్ తాజా మాజీ సర్పంచ్ లింగంపెల్లి సత్తయ్య కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశంలో పాద యాత్ర చేసి పేదల సంక్షేమం కోసం పాటుపడతానని హామీ ఇచ్చారన్నారు. దేశ సంపద అన్ని వర్గాలకు అందజేస్తామన్నారు. బీజేపీ పాలనలో రైతులకు నల్ల చట్టాలు తెచ్చారని అన్నారు. బీజేపీని ప్రశ్నిస్తే రేవంత్‌రెడ్డిపై కేసు పెట్టారన్నారు. మతం పేరిట రాజకీయం చేస్తున్నదన్నారు. బీజేపీకి ఓడిపోతామని భయం



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

పట్టుకుందన్నారు. రిజర్వేషన్లను ఎత్తివేసే కుట్రలో భాగంగా 400 సీట్లు అడుగుతున్నారన్నారు. బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగం రద్దు చేస్తారన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్ఎస్ పని అయిపోయిందన్నారు. బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు రాదని, తెలిసి కేసీఆర్ ఆగ మేఘాల మీద బస్సు యాత్ర చేపడుతున్నారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావు గెలిపిం చాలని కోరారు. జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు రామస్వామి, ముకుంద రెడ్డి, లింగారెడ్డి, దర్మపురి శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, బాలు, సత్య నారాయణ రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు,

వేములవాడ రూరల్: కేంద్రంలో తిరిగి బిజెపి అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దు చేస్తారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బొల్లారం, లింగంపల్లి, హన్మాజిపేట్, మర్రిపల్లి, నాగాయపల్లి, పోశెట్టిపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నాలుగు మాసాల్లో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేశామన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి రాజేందర్‌రావును గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వకులాబరణం శ్రీనివాస్, ఎంపీటీసీలు రంగు వెంకటేశం, శ్యామల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్యారంటీలు అమలు చేస్తాం

తిమ్మాపూర్, మే 4: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన గ్యారంటీలు అమలు చేస్తామని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావుకు మద్దతుగా ఎమ్మెల్యే మండలంలోని పలు గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని పర్లపల్లి, మొగిళిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

రాణి రుద్రమపై ఫిర్యాదు

వీణవంక, మే 4: మంత్రి పొన్నం ప్రభాకర్‌పై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి రాణి రుద్రమపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు శనివారం ఎస్సై తిరుపతికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మంత్రిపై ఆరోపణలు చేస్తే సహించబోమని తెలిపారు. ఆమె క్షమాపణలు చేపట్టాలన్నారు. నాయకులు గంగాడి రాజిరెడ్డి, సాహెబ్ హుస్సేన్, పైడికూమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అట్టడుగువర్గాలకు న్యాయం



రేపాకలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్/ ఇల్లంతకుంట, మే 4: కాంగ్రెస్‌తోనే అట్టడుగువర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని రేపాకలో శనివారం ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాజ్యాంగానికి రక్షణ ఉంటుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఉన్నందున ఎంపీ కూడా కాంగ్రెస్‌కు చెందిన అభ్యర్థి గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామ అధ్యక్షుడు దయాసాగర్, ఎంపీటీసీ సుమలతమల్లేశం, నాయకులు చందు, శ్రీను, కిష్టారెడ్డి, శ్రీనివాస్, ఎల్లవ్వ పాల్గొన్నారు.

● సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్, సర్దాపూర్, పెద్దబోనాల, చంద్రంపేటలో కాంగ్రెస్ నాయకులు శనివారం ఇంటింటా ప్రచా రం చేపట్టారు. పార్టీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్ గౌడ్, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్ కుమార్, వార్డు అధ్యక్షులు ప్రశాంత్, రమేష్, యూత్ అధ్యక్షుడు శ్యాం, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేం ద్రంలో శనివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరీంనగర్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్‌రావు తరపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మండల కాం గ్రెస్ అధ్యక్షుడు హమీద్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు తిమ్మాపూర్, బొప్పాపూర్, గొల్లపల్లి, కోరుట్లపేట, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, బండలింగంపల్లి తదితర గ్రామాల్లో కరీంనగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుకు మద్దతు ఆ పార్టీ నాయకులు శనివారం ఇంటింటాప్రచారం నిర్వహించారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, చందు, బాబు, శ్రీనివాస్, కిషన్, అంజయ్య పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండల కేంద్రంతోపాటు, పోతుగల్, గూడెం, ఆవునూర్, కొండాపూర్ గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు రాజు, ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రంజాని నరేశ్, పట్టణ అధ్యక్షుడు విజయ్‌రెడ్డి ఉన్నారు.

రుద్రంగి: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జడ్పీటీసీ గట్ల మీనయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో బాగంగా రుద్రంగి మండల కేంద్రంలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లడూతూ గ్రామాలు అభివృద్ధి చెందాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, పింఛన్లు, రావాలన్నా కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే సాధ్యమన్నారు. తర్రె మనోహర్, గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, చెలుకల తిరుపతి, ఇప్ప మహేష్, తర్రె లింగం పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టాలి



మల్యాలలో ప్రచారం చేస్తున్న బోయినపల్లి మాధవి

గంభీరావుపేట, మే 4: అభివృద్ధి చేసే నాయకుడికి ప్రజలు పట్టం కట్టాలని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు అన్నారు. గంభీరావుపేట మండలం ముచ్చర్ల, లింగన్నపేట గ్రామాల్లో శనివారం బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి వినోద్‌కుమార్ తరపున ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వినోద్‌కుమార్ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో ఎంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. జరిగిందన్నారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలన్నారు. ఎంపీగా అవకాశం ఇచ్చి పార్లమెంటుకు పంపితే బండి సంజయ్ ఏనాడూ తెలంగాణ కోసం మాట్లడలేదన్నారు. భారీ మెజార్టీతో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, ఎంపీపీ వంగ కరుణ, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నాయకులు దయాకర్‌రావు, సురెందర్‌రెడ్డి, లక్ష్మన్, మల్లేశం, రవీందర్, రాజు ఉన్నారు.

సిరిసిల్ల రూరల్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, పార్లమెట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని వార్డు కౌన్సిలర్లు లింగంపల్లి సత్యనారాయణ, పోచవేణి సత్యఎల్లయ్యయాదవ్, పాతూరి రాజిరెడ్డి, బుర్ర లక్ష్మీశంకరయ్య కోరారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, సర్ధాపూర్, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, చంద్రంపేటలో శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు ఎరవెల్లి వెంకటరమణారావు, షేక్ అలీ,భూక్య తిరుపతి నాయక్, పెరుమాండ్ల రాములు, కొంపెల్లి రవీందర్, సల్లూరి శ్రీనివాస్, రాజు, సాయికుమార్, కార్తీక్, తిరుపతి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ప్రజా పాలన కొనసాగాలంటే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని, పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వినోద్‌కుమార్‌ను గెలిపించాలని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చందుర్తి: కరీంనగర్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌ను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మల్యాలలో బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్ సతీమణి మాధవి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండలం సుద్దాలలో బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారాన్ని కొనసాగించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ బండ నర్సయ్య, ఎంపీపీ చంద్రయ్య గౌడ్, ఎంపీటీసీ కాసేవేని మమత మహేష్, సింగిల్ విండో వైస్ చైర్మన్ మహేష్, ఎల్లయ్య రామస్వామి తదితరులు ఉన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో శనివారం వినోద్ కూమార్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటా ప్రచా రాన్ని నిర్వహించారు. ఎంపీపీ గంగం స్వరూపరాణి మహేష్, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఎంపీటీసీ మంచె లావణ్య రాజేశం, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాల కమాలాకర్ , తదితరులు పాల్గొన్నారు.

చిల్లర మాటలు తప్ప చేసిందేమీ లేదు

సిరిసిల్ల టౌన్, మే 3: నాలుగున్నర నెలలుగా చిల్లర మాటలు, ఉద్దెర పనులు తప్పా సీఎం రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. శనివారం సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా కుల సంఘాలతో కేటీఆర్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం తెలంగాణలో పరిపాలన పిచోడి చేతిలో రాయిలా మారిందన్నారు. కేసీఆర్ రూ.3వేల కోట్లు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల నేతన్నల బతుకులు నిలబెట్టారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 17 పార్లమెంట్ నియోజకవర్గాలకు 17 జిల్లాలు ఉండాలని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని, 33 జిల్లాలో ఏ జిల్లాలను తొలగిస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దమ్ముంటే నేతన్నలకు రూ. 6వేల కోట్ల ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిన్న మొన్నటి వరకు తంగళ్లపల్లి బ్రిడ్జి కింద గోదావరి నీళ్లు కనిపించేవని రేవంత్‌రెడ్డి వచ్చాక మాయమయ్యాయని అన్నారు. ఈ ప్రాంతంలో బోర్లు ఎత్తిపోతున్నాయని, ప్రజల గొంతులు ఎండి పోయి నీళ్ల కోసం అలమటిస్తున్నారని అన్నారు. రైతుల పంటలు ఎండి పోతున్నా రేవంత్‌రెడ్డి ఒక్కమాట మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పే అబద్ధాలను ప్రజలు చీత్కరిస్తున్నారన్నారు. ఈ నెల 13న తెలంగాణ ప్రజలు బుద్ధి చెపుతారన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్

అంతకుముందు అనంతరం తంగళ్లపల్లి మండలం బీఎస్పీ అధ్యక్షుడు గుండు ప్రేమ్‌కుమార్ తన అనుచర వర్గంతో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, ఉపాధ్యక్షుడు ఎండీ సత్తార్, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ అన్నారపు శ్రీనివాస్, నాయకులు అగ్గిరాములు, మల్లారెడ్డి, పడిగెల రాజు, కోడి అంతయ్య గజభీంకర్ రాజన్న, రమాకాంత్ పాల్గొన్నారు.

మోసపోతే గోసపడతం

వీర్నపల్లి: ఎన్నికల్లో మొదటిసారి మోసపోయిన ప్రజలు మరోసారి మోసపోవద్దని, మోసపోతే గోసపడతామని సిరిసిల్ల ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అరచేతిలో వైకుంఠాన్ని చూపించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, అరచేతిలో స్వర్గం చూపించిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్ల అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి ఏమిటని ప్రశ్నించారు.

బీజేపీ ప్రభుత్వంలో లోక్‌సభ ఎంపీగా అభివృద్ధి చేసిన శిలాఫలకం ఒక్కటి చూపించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 10 నుంచి 12 సీట్లు గెలిపిస్తే రాష్ట్రంలో కేసీఆర్ రాజకీయాన్ని మారుస్తారన్నారు. కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేటీఆర్ సమక్షంలో మండల కేంద్రానికి చెందిన 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీటీసీ కళావతి, ఎంపీపీ భూల, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, సెస్ డైరెక్టర్ మల్లేశం, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, మహిళా అధ్యక్షురాలు కళ, యూత్ అధ్యక్షుడు దేవరాజు, వైస్ ఎంపీపీ హేమ, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సాగర్, మండల కోఆప్షన్ సభ్యుడు ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

హోం ఓటింగ్ పరిశీలన

ధర్మపురి, మే 4: ధర్మపురి మండలంలో హోం ఓటింగ్ శనివారం నిర్వహించా రు. ధర్మపురి పట్టణంతో పాటు, మండలంలోని ఆరెపల్లి తదితర గ్రామాల్లో విక లాంగులు, వృద్ధులు, నడవలేని వ్యక్తుల సౌకర్యార్థం హోం ఓటింగ్ నిర్వహించారు. ఆరెపల్లి గ్రామంలో నిర్వహించిన హోం ఓటింగ్‌ను పెద్దపల్లి పార్లమెంట్ ఎ న్నికల సహాయ అధికారి, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దివాకర టీ ఎస్ పరిశీలించారు. అనంతరం ఆయన ధర్మపురి ఫెసిలిటేషన్ కేంద్రంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో మొత్తం 259 మంది కోసం హోం ఓటింగ్ సౌకర్యం కల్పించినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ కృష్ణచైతన్య, పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పెగడపల్లి : పెగడపల్లి మండలంలో శనివారం నిర్వహించిన హోమ్ ఓటింగ్ వంద శాతం నమోదైంది. పార్లమెంట్ ఎన్నికలలో బాగంగా పూర్తిగా నడవలేని దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడి బెడ్ సిక్ అయిన వారిని మండలంలోని 23 గ్రామాలలో 65 మందిని గుర్తించారు. వీరందరి ఇండ్లకు ఎన్నికల సిబ్బంది వెళ్లి వారి చేత ఓటు వేయించారు.

ఎండలతో జాగ్రత్తగా ఉండాలి

కోరుట్ల, మే 4 : ఎండతాకిడి తట్టుకోవడదనికి జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యం కాపాడుకోవాలని మున్సిపల్ కమీషనర్ తిరుపతి అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లో పని చేసే వారికి వాటర్ క్యానులను అందించి మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున పారిశుద్ధ్య కార్మికులు, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్ కార్మికులు ఎండలో తీసుకోనే జాగ్రత్తలను వివరించారు.